క్లుప్తంగా

అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సీతానగరం: విద్యార్థులు శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగంపై ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

దోమల నివారణే లక్ష్యం

• ఈఓపీఆర్‌డీ కుమారవర్మ



అప్పయ్యపేట కాలువల్లో మలాథియాన్ పిచికారీ చేస్తున్న కార్మికులు

సీతానగరం: దోమల నివారణే లక్ష్యంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్‌డీ కె. కుమారవర్మ అన్నారు. మండలంలోని కాశీపేట, అప్పయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సర్పంచ్‌ల సమక్షంలో మలాథియాన్ మందు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన పారిశుధ్య వారోత్సవాలు



పట్టణంలో కుండీలో నీటిని తొలగిస్తున్న ఆశావర్కర్లు

పార్వతీపురం: జూలై 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పారిశుధ్య వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా గ్రామాల్లోని కాలువల్లో పూడికతీత పనులు, దోమల నివారణకు మలాథియన్ పిచికారీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మలేరియా, డెంగీ, తదితర వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

చురుగ్గా తాత్కాలిక షెడ్డు నిర్మాణం



ఏరియా ఆస్పత్రిలో నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో తాత్కాలిక షెడ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. గత నెల 22న సాలూరు ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. ఆస్పత్రికి రోగుల తాకిడి, అందిస్తున్న వైద్యసేవలు, ఇతర అంశాలపై ఆరా తీసి, తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. దీంతో అధికారులు పనులు చేపడుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సర్పంచ్, తదితరులు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించాలని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రాంబాబు అన్నారు. ఉపాధి వేతనదారులతో కలిసి గ్రామంలోని కోనేటి వద్ద శనివారం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ పథకం, ఉద్యానవన శాఖల సమన్వయంతో పంచాయతీ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పంచాయతీ కార్యదర్శి బి.సింహాచలం, సచివాలయ, ఎన్ఆర్ఐజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత..



లోవరఖండి గ్రామ సమీపంలో రహదారి దుస్థితి



కె.పెద్దవలస సమీపంలో గోతుల్లో చేరిన వర్షపునీరు



ఎస్.పెద్దవలస - మావుడి గ్రామాల మధ్య పాడైన రహదారి



మక్కువ - చినబోగిలి మధ్య రహదారిపై ఏర్పడిన గోతులు

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లె రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రహదారులన్నీ గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రహదారులకు మరమ్మతులు చేపట్టేవారు. కాని కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తవుతోంది. ఇంతవరకు రహదారులకు కనీసం మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని లోవరఖండి, కె.పెద్దవలస, ఎస్.పెద్దవలస గ్రామాలతోపాటు, మక్కువ నుంచి చినబోగిలి, బొబ్బిలి, సాలూరు పట్టణాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వానంగా మారాయి. పాలకులు, అధికారులు స్పందించి కనీసం గోతులనైనా పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – మక్కువ

రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోండి

• ఎంవీఐ ప్రసాద్



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్

సాలూరు: రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలికల కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రతపై అవగాహన ఏర్పరచుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పి. నారాయణరావు, ఏఎంవీఐ కాశీరాంనాయుడు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



బలిజిపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



సాలూరు: విరాళాలు సేకరిస్తున్న నాయకులు

బలిజిపేట: కేరళ రాష్ట్రం వయనాడ్‌లో గత నెల 29న కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు సీపీఎం నాయకులు శనివారం విరాళాలు సేకరించారు. సేకరించిన నగదును పార్టీ తరఫున బాధితులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మన్మధరావు, జి.సత్యనారాయణ, ఎస్.ఈశ్వరరావు, ఎం.సింహాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సాలూరు: కేరళ రాష్ట్రం వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వై నాయుడు కోరారు. పార్టీ పిలుపు మేరకు పట్టణంలో విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు శంకరరావు, విశ్వేశ్వరరావు, బాలరాజు, గిరిజన సంఘ జిల్లా నాయకులు ఎస్. అప్పారావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుద్దాం

పార్వతీపురం టౌన్: వరద బాధితులకు అండగా నిలుద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ వద్ద పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: నిధులు సమీకరిస్తున్న సీపీఎం నాయకులు

రైతుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న రైతులు

సాలూరు: పాచిపెంట మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన రైతులు శ్రమదానంతో మదుముకు మరమ్మతులు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. పాచిపెంట మండల కేంద్రంలో గల పెద్దగెడ్డ రిజర్వాయర్ కాలువ ద్వారా పి.కోనవలస, విశ్వనాథపురం, తదితర శివారు గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతోంది. అయితే పి.కోనవలస, విశ్వనాథపురం గ్రామాల మధ్య గల మదుము పాడవ్వడంతో నీటి సరఫరాకు ఇబ్బందులేర్పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో జైకా నిధులతో మరమ్మతులు చేపట్టారు. అయితే ప్రస్తుతం మళ్లీ మదుము పాడవ్వడంతో రైతులు శ్రమదానంతో బాగు చేసుకున్నారు.

29న మిగులు సీట్లకు కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27న కళాశాలకు వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం 27న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

దివ్యాంగులకు అండగా నిలుద్దాం..



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: దివ్యాంగులకు అన్ని స్థాయిల్లో అధికారులు అండగా నిలవాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. న్యాయస్థానం ప్రాంగణంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దివ్యాంగుల హక్కులు, వాటికి భంగం కల్పిస్తే చట్టంలో ఉన్న శిక్షలపై సచివాలయ సిబ్బంది, దివ్యాంగులకు అవగాహన కల్పించారు. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు సేవలు అందించే క్రమంలో స్నేహపూర్వకంగా నడచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పల్లా మునిస్వామి, మరిచర్ల జగన్మోహనరావు, తదితరులున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధం

• సీనియర్ న్యాయవాది రేగు మహేశ్వరరావు



రేగు మహేశ్వరరావు

సాలూరు: ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధమని గిరిజన ఉద్యోగుల న్యాయ సలహాదారు, సీనియర్ న్యాయవాది రేగు మహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ విషయంలో ఒక కులాన్ని చేర్చాలన్నా, తీసివేయాలన్నా ఆ అధికారం పార్లమెంట్‌కే ఉందని.. సుప్రీంకోర్టుకు కూడా లేదన్నారు. ఎస్సీ జాబితాలో ఎవరినీ చేర్చమని.. తొలగించమని సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో పేర్కొనలేదని స్పష్టం చేశారు. అవగాహనారాహిత్యంతో కొంతమంది సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధమంటున్నారని తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. భక్తులు, దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. జూన్ 1 నుంచి ఈ నెల 3 వరకు 64 రోజులకు గాను రూ.9,40,899 ఆదాయం సమకూరింది. 850 గ్రాములు బంగారం, 700 గ్రాముల వెండితో పాటు అమెరికా డాలర్లు-2, బ్యాంక్ ఆఫ్ కొరియా 1000 ఓన్-1, కతర్ రియల్-1 చొప్పున వచ్చాయని ఈఓ తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..



కొమరాడ: ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్రిల రవీంద్రను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



పాలకొండ: బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

కొమరాడ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో మాజీ ఎంపీటీసీ గొర్రిల రవీంద్ర తండ్రి తవిటి నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం రవీంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. తవిటినాయుడు మృతికి నివాళులర్పించారు. రవీంద్రను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, పప్పల గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

చినకుదుమలో..

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ గ్రామానికి చెందిన నల్ల సాయికార్తీక నాయుడు ఇటీవల కర్నూలు ట్రిపుల్ ఐటీలో చదువుతూ మృతి చెందిన విషయం విదితమే. వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు బలగ వెంకటరమణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జి.సంపత్‌కుమార్, లోలుగు నారాయణరావు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాలకొండ: నగర పంచాయతీలోని మండల వెంకటరమణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. ఇటీవల వెంకటరమణ భార్య మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే గులివిందల గడ్డిమినాయుడు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు దుప్పాడ పాపినాయుడు, వై.లిల్లీపుష్పనాథం, గణేష్, శాసపు రమణ, తదితరులు ఉన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

• సీఐటీయూ జిల్లా కోశాధికారి వెంకటరమణ

పార్వతీపురం టౌన్: ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. వెంకటరమణ కోరారు. ఈ మేరకు పలువురు ఆశావర్కర్లతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వి. ఇందిర, ఎం. శివానీ, గౌరి, లక్ష్మి, జ్యోతి, కృష్ణవేణి, పార్వతి, టి. లక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి. సూరిబాబు, తదితరులు కోరారు.

సహారా ఖాతాదారులకు చెల్లింపులు చేపట్టాలి..

పార్వతీపురం టౌన్: సహారా ఖాతాదారులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే విజయచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, పార్వతీపురం బ్రాంచ్ పరిధిలో సుమారు 40 వేల మంది ఖాతాదారులకు వంద కోట్ల రూపాయలకు పైగా చెల్లింపులు జరగాల్సి ఉందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూరిబాబు, ఇందిర, శ్రీనుబాబు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా హాజరైతే సహించేది లేదు..

• ఎమ్మెల్యే విజయచంద్ర



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర, అధికారులు

బలిజిపేట: అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి వచ్చినప్పుడు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని, మొక్కుబడిగా వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయచంద్ర శాఖల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి, పంచాయతీరాజ్ అధికారులు పూర్తి సమాచారంతో రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై సమావేశాలకు సమగ్ర సమాచారంతో రావాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వి.సాయిరాం, బి.హేమలత, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఎంఈఓ-1 సామల సింహాచలం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వరుస నాట్లతో ప్రయోజనాలెన్నో..

• ఏఓ అశోక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి అశోక్

పార్వతీపురం టౌన్: వరుస పద్ధతిలో వరి నాట్లు వేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి అశోక్ అన్నారు. మండలంలోని డోకిశీల గ్రామంలో వరుస పద్ధతిలో నాట్లు విధానంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వరుసకు 20 సెంటీమీటర్ల దూరం, ప్రతి మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో మొక్కలు నాటడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు సోకకుండా ఉంటాయన్నారు. అనంతరం వేపగింజ కషాయం తయారుచేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీటీసీ, డీఆర్‌సీలు ఆర్. శ్రీనివాసరావు డి. భారతి, బి. శారద, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషక విలువలు



నిడగల్లులో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సీతానగరం: తల్లిపాలలో పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ నిడగల్లు సెక్టార్ ఎస్ఓ పద్మ అన్నారు. సెక్టార్ పరిధిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ విషయాన్ని తల్లులకు వివరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధరణి, ఏఎస్ఎం జె. గౌరి, అంగన్‌వాడీ కార్యకర్తలు గంట జ్యోతి, జె. అనసూయమ్మ, టి. జయలక్ష్మి, వి. రాజమణి, పి. నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గోగుసాగుపై తగ్గిన ఆసక్తి



గరుగుబిల్లిలో పండిస్తున్న గోగుపంట

గరుగుబిల్లి: గోగుసాగుపై రైతులకు గత కొన్నేళ్లుగా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో ఏటా గోగుసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ముఖ్యంగా విత్తనాలను సరఫరా చేయకపోవడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాల వల్ల గోగు సాగుకు రైతులు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం గోగు సాగుకు అయ్యే మదుపులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. నారతీత సమయంలో కూలీల కొరత, మదుపులు అధికం కావడం, గిట్టుబాటు ధర లభించకపోవడం, జూట్ కార్పొరేషన్ నుంచి కూడా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. మండలంలో 1150 ఎకరాలలో గోగు పంటను సాధారణంగా సాగుచేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనావేయగా కేవలం 500 ఎకరాలలోనే గోగుసాగు అవుతోందని అధికారులు చెపుతున్నారు.